
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## జగిత్యాల జిల్లా వార్తలు

5★★

బుధవారం 30 ఏప్రిల్ 2025


# సౌకర్యాలు ఉన్నా.. ఆదరణ కరువు

- ప్రభుత్వ పాఠశాలల్లో యేటా తగ్గుతున్న విద్యార్థులు
- చేర్పించేందుకు అంతగా ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- ప్రవేశాల పెంపుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- వసతులపై కరపత్రాలతో గ్రామాల్లో ప్రచారం



ముందస్తు బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ఉపాధ్యాయులు.. సొంత భవనాలు..చక్కటి సదుపాయాలు... సాం కేతిక బోధనకు పెద్దపీట...వెరసి ప్రభుత్వ పాఠశాలలు ప్రత్యేకతను చాటుతు న్నాయి. కానీ విద్యార్థుల సంఖ్య పరంగా మాత్రం అనేక ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడుతున్నాయి. గతంతో పోలిస్తే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడం ఆందోళన కలిగి స్తోంది. తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో కూడా మార్పు రావాల్సి ఉందని విద్యా వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థులసంఖ్య పెం చేందుకు కృషి చేయాలంటూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణి ఇటీ వల ఉపాధ్యాయ సంఘాలకు, ఉపాధ్యా యులకు సూచించడంతో సమష్టిగా పని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్న అభిప్రా యాలు వ్యక్తం అవుతున్నాయి.

### ప్రత్యేక కార్యాచరణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పలు పాఠశా లల రూపురేఖలు మారుతున్నాయి. అయి నప్పటికీ విద్యార్థుల సంఖ్య ఏ యేటికి ఆ యేడు తగ్గుముఖం పడుతుంది. ప్రతి సంవత్సరం జూన్ తొలి వారంలో బడి బాట నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని చోట్ల మాత్రమే సీట్లు నిండుతుండగా అనేక చోట్ల ఖాళీగా ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2022-23 విద్యా సంవత్సరంలో 8,670 మంది విద్యార్థులు బడిబాటలో భాగంగా పాఠశాలల్లో చేరారు. 2023-24 విద్యా సంవత్సరంలో 7,908 మంది మాత్రమే చేరారు.

2024-25 విద్యా సంవత్సరంలో సంఖ్య మరింతగా తగ్గి 6,078 మంది విద్యార్థులు బడిబాటలో భాగంగా పాఠశాలల్లో చేరినట్లుగా విద్యాశాఖ రికార్డులు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకొస్తూ రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడంపై విద్యాశాఖ కసరత్తులు చేస్తోంది.

### విద్యార్థుల సంఖ్య పెంచేలా కసరత్తు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పన, మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడానికి మొగ్గు చూపడానికి కారణాలను అన్వేషిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులసంఖ్య పెంపుపై దృష్టి సారించింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠ శాలలు విద్యార్థులతో కళకళలాడేలా చేయడానికి కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఆకట్టు కునేలా వినూత్న శైలిలో బోధన చేయ డానికి ప్రాధాన్యం తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుండడం తల్లి దండ్రులకు వివరించే ప్రయత్నాలు చేయడంపై దృష్టి సారించారు.

### ఇదే అనువైన సమయం..

ప్రస్తుతం వేసవి సెలవులున్నాయి. ఈ సమయంలో ఉపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలో కొత్తగా బడుల్లో చేరే పిల్లల వివరాలను ముందుగా సేకరించడంపై దృష్టి సారించారు. తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ బడిలో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో బోధనా ఫీజులు, పాఠశాల బస్సు చార్జీలు, పుస్తకాలు, ఏడాదికి విద్యార్థికి అయ్యే ఖర్చు తదితర వివరాలు తెలియజేయడంపై పలు పాఠశాలల ఉపాధ్యాయులు దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యా బోధన చేస్తామని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇలా..

జిల్లా వ్యాప్తంగా వివిధ 838 ప్రభుత్వ, కేజీబీవీ, జడ్పీ, మినీ గురుకులాలు, టీఎస్ మోడల్ స్కూల్స్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర పాఠశాలలున్నాయి. ఇందులో 514 ప్రాథమిక పాఠశాలలు, 91 ప్రాథమికోన్నత పాఠశాలలు, 233 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 3,568 ఉపాధ్యాయులు పనిచేస్తు న్నారు. 1,173 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, 454 మంది ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, 1,706 మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, 285 కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 57,771..

మిగతా 8లో

## జిల్లాలో 2,645 రేషన్‌కార్డులు మంజూరు

జగిత్యాల ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 2,645 రేషన్ కార్డులు మంజూరు అయినట్లు అదనపు కలెక్టర్ బీఎస్ లత తెలిపారు. ఈ రేషన్ కార్డుల్లో ఉన్న సభ్యులతో పాటు ఇదివరకే ఉన్న కార్డులలో అదనంగా కొత్త వారిని నమోదు చేయగా మొత్తంగా జిల్లాలో 47 వేల ఆరు యూనిట్లు మంజూరు అయినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందుకు గాను 2,77,720 మెట్రిక్ టన్నుల బియ్యం మంజూరు అయ్యా యని తెలిపారు. లబ్ధిదారులు వచ్చే నెల నుంచి చౌక ధరల దుకాణాలలో బియ్యం ఉచితంగా పొందవచ్చని ఆమె తెలిపారు.

## 'రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి'



పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి కోసం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో రూ.13.5 లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, గ్రామంలో రూ.15 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలోని ఇటిక్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.13 లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామంలో పల్లెదవాఖానా నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఇటిక్యాల-రామారావుపల్లె గ్రామాల మధ్య రూ.9 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. మూటపెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు.

కుమ్మరిపెల్లిలో రూ.కోటి50లక్షలతో నిర్మించనున్న వీరాపూర్- కుమ్మరి పెల్లి బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. కిష్టంపేటలో అల్లీపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సారంగాపూర్ పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ బాపిరాజు చిన్నమ్మ, రాయికల్ మండలం ఉప్పుమడుగుకు చెందిన పల్లపు భాగ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మోర హన్మాం డ్లు, కోల శ్రీనివాస్, జీవన్ రావు, ముత్తన్న, రాజరెడ్డి, ఎఫ్‌పీవో అధ్యక్షుడు అత్తినేని శంకర్, డైరెక్టర్లు రాజన్న, శంకర్, రాజలింగం, దేవేందర్ రావు, నాయకులు ముఖీద్, జాన గోపి, తిరుపతి గౌడ్, రత్నాకర్ రావు, సత్తయ్య, శ్రీనివాస్, కొండాల్ రెడ్డి పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

బుగ్గారం ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపూర్, బుగ్గారం గ్రామాలకు చెందిన పలువురు వివిధ కారణాలతో మృతి చెందడంతో వారి కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. గోపులాపూర్ గ్రామానికి చెందిన బీర్పూర్ గంగన్న అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సీర్నేని మల్లేశం, బుగ్గారం గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నం సత్తయ్య గౌడ్, మాజీ మండల కో ఆప్షన్ అబ్దుల్ రహమాన్, నాయకులు పాల్గొన్నారు.

## విప్ లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర రమేష్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): ధర్మపురి శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధర రమేష్ కోరారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసిన జనాభా లెక్కల ప్రకారం మాదిగలు 11 శాతం ఉన్నారని, మాలలు 5 శాతం ఉన్నారని తేలిందన్నారు.

జనాభాలో 5 శాతం ఉన్న మాల సామాజిక వర్గానికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని, మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామిళ్ళ లక్ష్మణ్, మెడపట్ల చంద్రయ్య, చిర్ర లచ్చయ్య, దొనకొండ మోహన్, కొత్తూరి రాజేశం, శ్రీనివాస్, కుంటాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం మృతులకు నివాళి

రాయికల్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో తీవ్రవాదుల దాడిలో మృతి చెందినవారికి మంగళవారం పట్టణ యువకులు, ముస్లీం నాయకులు నివా ళులు అర్పించారు. అనంతరం స్థానిక బస్టాండ్‌లో పాకిస్థాన్ జెండాను తొక్కుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువకులు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## 'సమస్యల సత్వర పరిష్కారానికే భూ భారతి'

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికే భూ భారతి చట్టం అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా విప్ మాట్లాడుతూ భూభారతి చట్టంతో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగు తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామ పాలనాధికారుల నియామకం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అవగాహన సదస్సులో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, మార్కెట్ ఛైర్మన్ రాములుగౌడ్, సింగిల్‌విండో ఛైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ బి.రవీందర్, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ సత్తిరెడ్డి, గిర్దావర్‌లు శ్రీనివాస్, జమున, ఆంజనేయులు పాల్గొన్నారు.

### భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్: భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రాయికల్‌లో మంగళవారం భూ భారతిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి ప్రజలకు భూ భారతిపై అవగాహన కల్పించారు. రాయికల్ పట్టణం, మండలానికి చెందిన 60మంది లబ్ధిదారు లకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.17 లక్షల 50 వేల విలువ గల చెక్కులను, 14 మందికి కళ్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన రూ.14లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ ఖయ్యూం, పీఏసీఎస్ ఛైర్మన్‌లు ఏనుగు మల్లారెడ్డి, రాజలింగం, ముత్యం రెడ్డి, రాజరెడ్డి, ఎంపీవో సుష్మా, ఏవో ముక్తేశ్వర్, రాయికల్ పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

## భూషణరావుపేటలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం




ధాన్యాన్ని తూకం వేస్తున్న కూలీలు

కథలాపూర్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావు పేటలో మంగళవారం ధాన్యం కొనుగోళ్లు తిరిగి ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రంలో 'హమాలీలు లేక నిలిచిన కొనుగోళ్లు' అనే శీర్షికన సోమ వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇతర కేంద్రాల నుంచి కూలీలను రప్పించి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని డీఆర్ డీఓ రఘువరన్ సందర్శించి ఎక్కడా హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం చింతకుంట, కథలా పూర్ కేంద్రాలను తనిఖీ చేశారు. కొనుగోళ్ళు వేగవంతం చేయాలని, గన్నీ సంచు లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం నరహరి, వీఓఏలు ఉన్నారు.

## 'వేసవి క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'

కోరుట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మే1 నుంచి 31 వరకు నిర్వహించే వేసవి క్రీడా శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ పీఈటీలు వెంకటరెడ్డి గంగాధర్, చిలుక లక్ష్మీనారాయణ, పీఈటీలు వాసాల నవీన్ కుమార్, వాసాల రాజు, శ్రీనివాస్‌లు మంగళవారం తెలిపారు. వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్‌లో ఉదయం, సాయంత్రం శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): .పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాల్లో వచ్చే సిబ్బందికి ఇవ్వాలని కోరారు. పట్టణంలోని పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని మంగళవారం కమిషనర్ పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడి చెత్తను బయట వ్యక్తులకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని ఇళ్లలో నుంచి వెలువడే పొడి చెత్తను ఆటో డ్రైవర్లు పొడి వనరుల సేకరణ కేంద్రానికి ప్రతి రోజు తరలించాలని ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు కార్యక్రమంలో డిఈ నాగేశ్వరరావు,ఇంచార్జ్, సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్,నరేష్ పాల్గొన్నారు.

## హత్యకేసు నిందితుల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఏసీపీ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ఓ వ్యక్తిని హత్యచేసిన నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టుచేశారు. ఈ ఘటన వివరాలను ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ గజ్జికృష్ణ వెల్లడించారు. హత్యకు గురైన అపన్నపేటకు చెందిన పోలం కుమార్(38)కు దొంగతుర్తికి చెందిన వరుసకు మరదలు శైలజతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని శైలజ భర్త వేల్పుల సంతోష్ కొంతకాలంగా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గొడవలు జరిగాయి. సోమవారం వ్యవసాయమార్కెట్‌కు రా మాట్లాడుకుందామని కుమార్‌ను పిలిచాడు. సంతోష్ తన భార్యను తీసుకొని పథకం ప్రకారం జెండాచౌరస్తాలోని ఓ దుకాణంలో కత్తి కొనుగోలు చేసి వ్యవసాయమార్కెట్‌కు చేరుకున్నాడు. పోలం కుమార్ తన కారులో వచ్చాడు. మాటల్లో గొడవకు దిగారు. సంతోష్ వెంట తెచ్చుకున్న కత్తితో కుమార్‌పై దాడి చేశాడు. భార్య శైలజ కదలకుండా పట్టుకుంది. దాడితో కుమార్ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఏసీపీ తెలిపారు, ఈ ఘటన పెద్దఎత్తున సంచలనం సృష్టించింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుమార్ భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించి మంగళవారం ఇంట్లో ఉన్న సంతోష్, శైలజను అరెస్టుచేశారు. ఈమేరకు వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి కత్తి, రక్తపు మరకలతో ఉన్న బట్టలు స్వాధీనం చేసుకున్నారు. ఆయనవెంట సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మల్లేష్ ఉన్నారు.

## ప్రమాదవశాత్తు హమాలీ మృతి


రాజేశం(ఫైల్)

ధర్మారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండలకేంద్రానికి చెందిన మెడవేని రాజేశం(57) అనేహమాలి ప్రమాదవశాత్తూ లారీ కిందపడి మృతిచెందినట్లు ధర్మారం ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు. సోమవారం రాత్రి మేడారం గ్రామంలో లారీలో వడ్లు లోడ్ చేస్తుండగా లారీడ్రైవర్ గుర్రాల మల్లేశం నిర్లక్ష్యంతో లారీని ముందుకు పోనివ్వడంతో లారీపై నుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయలపాలైన రాజేశంను ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. రాజేశం భార్య రాజేశ్వరి ఫిర్యాధు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నర్సయ్య(ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి నెలరోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూమృతిచెందిన సంఘటన చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొమ్ము నర్సయ్య(42)అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో నెలరోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మంగళవారం తెలిపారు. మృతుడికి భార్య పద్మ,కూతుర్లు ఉచిత, జయ, కుమారుడు నిరంజన్ ఉన్నారు.

## మామిడిచెట్టుపై నుంచి పడి వలస కూలీ మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామంలో మామిడితోటలో మామిడి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి సీతారాం సాయక్కర్(57) అనే వలసకూలీ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నవారాగ్రామానికి చెందిన సీతారాం సాయక్కర్ ఉపాధినిమిత్తం జగిత్యాలకు వచ్చాడు. అంతర్గాం గ్రామంలో మంగళవారం మామిడికాయలు తెంపుటకు కూలికి వెళ్లాడు. మామిడి కాయలు తెంపుతున్న క్రమంలో కొమ్మవిరిగి సీతారాం సాయక్కర్ కిందపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి సీతారాం సాయక్కర్ మృతిచెందాడు. మృతుడి బంధువు పరిమళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

## తల్లి మృతిని తట్టుకోలేక తనయుడి బలవన్మరణం

గోదావరిఖని, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడీనగర్ ప్రాంతంలోని డాంబర్ ప్లాంట్ షెడ్డులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి తనతల్లి మృతిని తట్టుకోలేక సోమవారం రాత్రి ఉరి వేసుకుని మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన పప్పు కుమార్‌సింగ్(28), మేచినేని అజయ్ అనే రోడ్డు కాంట్రాక్టర్ వద్ద రెండు సంవత్సరాల నుంచి లోడర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. జీడీనగర్ ప్రాంతంలోని డాంబర్‌ప్లాంటు సమీపంలోని ఓ రేకులషెడ్డులో నివాసం ఉంటున్నాడు. మూడు నెలల క్రితం మృతుడి తల్లి అనారోగ్యంతో చనిపోయింది. అప్పటినుంచి తరచుగా తనతల్లిని తలచుకుని బాధపడుతూ మనోవేదన చెందేవాడని, ఈ విషయాన్ని తన తోటి పనివాళ్ల దగ్గర చెప్తూ బాధపడేవాడని తెలిపారు. అదేక్రమంలో తీవ్ర మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని యజమాని అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.


## వృద్ధుడి ఆత్మహత్య

కథలాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తక్కళ్ళపల్లికి చెందిన బైకని గంగారాం (60) అనే వృద్ధుడు అనారోగ్య కారణాలతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం గంగారాం కొన్నేళ్లుగా ఎనిమియా వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు రోజులుగా తీవ్రం కావడంతో మనస్థాపానికి గురై గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం చెందినట్టు చెప్పారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# విద్యుత్ సేవల విస్తరణకు ప్రత్యేక యాప్

వినియోగదారుల సమస్యలకు పరిష్కారం

అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎన్‌పీడీసీఎల్




గణేశ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 20 రకాల సేవలతో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపొందించి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, అంతరాయం, బిల్లులు చెల్లింపు, గతంలో చెల్లించిన బిల్లులకు సంబంధించిన సమాచారం, ఇలా ఏ విషయంలో సందేహాలు, సమస్యలున్నా సంస్థ కార్యాలయం గడప తొక్కాల్సిందే. మనం వెళ్లిన సమయంలో సంబంధిత అధికారి లేక పోవచ్చు, ఈ నేపథ్యంలో వినియోగదారుల ఇబ్బందులను తొలగించేందుకు టీజీఎస్పీడీసీఎల్ (TGNPDCL) పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ మెయిల్ ద్వారా లాగిన్ కావాల్సి ఉంటుంది. ఈ యాప్‌లో సమస్య నమోదు చేస్తే అధికారులు పరిష్కారం చూపుతారు.

**● కొత్త కనెక్షన్లు**

నివాసం గృహంలోని విద్యుత్‌మీటరు, పంట పొలానికి నీరందించే బోరుబావికి కొత్త సర్వీసు ఎలా పొందాలనే విషయాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దరఖాస్తు చేసు కుంటే అది మంజూరైందా ? లేదా ? దరఖాస్తు ఏ స్థాయిలో ఉంది? అనే పూర్తి సమాచారం దరఖాస్తు నంబరు అధారంగా తెలుస్తుంది. కొత్త విద్యుత్తు కనెక్షన్ ఎలా తీసు కోవచ్చు.. దరఖాస్తు సమయంలో ఏఏ ధ్రువ పత్రాలు జత చేయాలి? వంటి సమాచారం యాప్లో ఉంది.

**● సొంతంగా రీడింగ్..**

వినియోగదారులు నెలనెలా తాను వినియోగించిన విద్యుత్‌ను తానే లెక్కించుకునే వెసులుబాటు ఉంది. స్పాట్ బిల్లింగ్ తీసే వ్యక్తి సకాలంలో రాకుంటే వినియోగదారులే నేరుగా బిల్లింగ్ తీసుకునే అవకాశం ఉంది. నెలనెలా కేంద్రాలకు వెళ్లి వరుసలో నిల్చుని బిల్లు చెల్లించే అవసరం లేకుండా ఈ యాప్ లోనే చెల్లించవచ్చు. ఆయా సర్వీసులకు సంబంధించి గతంలో చెల్లించిన బిల్లులకుసంబంధించిన సమాచారం చూసుకోవచ్చు.

**● ఫిర్యాదులు**

విద్యుత్తు సరఫరాలో లోటుపాట్లు, అంతరాయాలకు సంబంధించిన ప్రతి అంశం పై యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంది. పరిష్కారం ఏ స్థాయిలో ఎక్కడ పెండింగ్‌లో ఉందో చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య సరిష్కారం కాకున్నా.. సంతృప్తికరంగా లేకున్నా తిరిగి ఫిర్యాదు చేసుకోవచ్చు. క్షేత్ర స్థాయిలో సమస్య ఎదురైతే ఫోన్లో ఫొటో తీసి ఫిర్యాదు చేయొచ్చు. ఆ ఫిర్యాదు నేరుగా సంబంధిత అధికారికి చేరుతుంది. సంబంధిత ప్రాంత సమస్య పరిష్కారమవుంది.

**● పేరు, లోడ్ మార్పు..**

మీటర్ పేరు మార్చుకోవాలన్నా, సర్వీస్ లోడ్ పెంచుకోవాలన్నా కావాల్సిన సమాచారం, చెల్లించాల్సిన నగదు వివరాలు యాప్ అందుబాటులో ఉన్నాయి. మీటరులో లోపాలుంటే మార్చుకునే వెసులుబాటు ఉంది. గృహ కేటగిరీ నుంచి వ్యాపారం, వ్యాపార కేటగిరీ నుంచి గృహ వినియోగానికి మార్చుకునే అవకాశం ఉంటుంది.

**● ప్రమాదాల నివారణ..**

విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఉపకరణాల వినియోగంలో ఆచరించాల్సిన పొదుపు సూచనలు యాప్‌లో ఉన్నాయి. 24 గంటలు పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. ఇలా 20 రకాల సేవలను వినియోగించుకునే సదుపాయాన్ని కల్పించారు.

**● అధికారుల వివరాలు..**

పట్టణ, గ్రామీణ స్థాయి అధికారులను సంప్రదించాలనుకుంటే వారి సెల్ ఫోన్ నంబర్లు యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అధికారులను నేరుగా సంప్రదించవచ్చు.

**సమయం ఆదా చేసుకోవచ్చు..**

**మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ**



ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్తు సేవలను ఉన్నచోటు నుంచే పొందవచ్చు. సమయం ఆదా చేసుకోవచ్చు. యాప్ ద్వారా చేసిన ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక విభాగం పర్యవేక్షిస్తుంది.

## ఆర్‌ఎస్‌ఐకి దేహశుద్ధి

● మద్యం మత్తులో అర్ధరాత్రి పక్కింటి పైఅంతస్థుకు..

● అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణపరిధి సర్ధాపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న 17వ బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ మహేశ్ ఓ ఇంటిపైకి వెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు నిద్రలేచి దొంగ..దొంగ అంటూ కేకలు వేయడంతో ప్రజలు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 17వ బెటాలియన్‌లో పనిచేసే ఆర్‌ఎస్‌ఐ మహేశ్ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఆర్‌ఎస్‌ఐ పక్క ఇంటి పైఅంతస్థుకు వెళ్లడంతో ఎండాకాలం కావడంతో పైన నిద్రిస్తున్న మహిళ లేచి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆర్‌ఎస్‌ఐని పట్టుకొని దేహశుద్ధి చేశారు. దొంగతనానికి వచ్చావా అంటూ నిలదీశారు. అప్పటికే సమాచారం అందుకున్న సిరిసిల్ల టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని ఆర్‌ఎస్‌ఐ మహేశ్‌గా గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై 17వ బెటాలియన్ కమాండెంట్‌కు సమాచారం అందడంతో మంగళవారం సర్ధాపూర్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. మద్యం మత్తులో ఉండడం వల్ల ఆర్‌ఎస్‌ఐ ఆ ఇంటికి వెళ్లినట్లు, పొరపాటున తన ఇంటికి వెళ్లాల్సింది పక్కింటికి వెళ్లినట్లు ఆర్‌ఎస్‌ఐ కమాండెంట్ విచారణలో చెప్పినట్లు తెలిసింది. సదరు ఇంటి కుటుంబసభ్యులు మంగళవారం సాయంత్రం వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని, తాను పొరపాటున ఆ ఇంటికిపైకి వెళ్లానని ఆర్‌ఎస్‌ఐ చెప్పినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

# బద్దిపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్న దర్శనం చేసుకున్న భక్తులు రాత్రి ఆలయ వసతిగదుల్లో విడిది చేసి మంగళవారం అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ, క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంటలతరబడి క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి పట్నాలు వేసి అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

**ఆలయ ఉద్యోగులతో భక్తులు వాగ్వాదం..**

వేములవాడ శ్రీబద్దిపోచమ్మ ఆలయ ఉద్యోగులకు, భక్తుల మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఓ కుటుంబ అమ్మవారి దర్శనానికి వచ్చారు. సదరు భక్తులు క్యూలైన్‌ల ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్లాల్సి ఉండగా ఎగ్జిట్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. గుర్తించిన ఆలయ ఉద్యోగులు వారిని నిలిపివేయడంతో దురుసుగా ప్రవర్తించారని. దీంతో అక్కడే ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బంది వచ్చి భక్తులను బయటకు పంపిచేందుకు ప్రయత్నించగా, సదరు ఉద్యోగితో సైతం దురుసుగా ప్రవర్తించడంతో ఆలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌లో ఫిర్యాదుల పర్వం

● తనపై దాడికి దిగారని అధిష్ఠానం వద్దకు పురుమల్ల శ్రీనివాస్

● శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని ఆర్టీఏ సభ్యుడు రాహుల్ డిమాండ్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కాంగ్రెస్‌లో ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. కొంతకాలంగా జిల్లా పార్టీలో చోటు చేసుకుంటున్న గ్రూపురాజకీయాలు సోమవారం డీసీసీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణం సన్నాహక సమావేశంలో భగ్గుమన్నాయి. రెండువర్గాల మధ్య తీవ్రవాగ్వాదంతో ఒకరినొకరు తోసుకున్నారు. దాదాపు దాడి చేసుకునేంత పనిచేశారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితర నాయకులు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. ఈ గొడవపై రెండువర్గాలు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో కష్టపడిన కార్యకర్తలు, నాయకుల నామినేటెడ్ పోస్టుల కోసం తాను ప్రతిపాదించగా ఒకరు అడ్డుకుంటున్నట్లు వేదికపై కరీంనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించినవేనంటూ ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మరికొందరు నాయకులు వాగ్వాదానికి దిగడంతో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. ఈ మేరకు మంగళవారం ఉదయమే హైదరాబాద్‌కు వెళ్లిన పురుమల్ల శ్రీనివాస్ తనపై రాహుల్‌తోపాటు కొందరు దాడికి దిగారంటూ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు మెయిల్ ద్వారా, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. తాను మూడు నాలుగు నామినేటెడ్ కమిటీలతోపాటు నియోజకవర్గ స్పెషల్ డెవలప్ ఫండ్ నిధులకు ప్రతిపాదనలు పంపిస్తే వాటిని ఒకరిద్దరు అడ్డుకొని వారికి అనుకూలంగా మలచుకుంటున్నారని మాత్రమే మాట్లాడానని, దీనిని కొంతమంది మంత్రిని ఉద్దేశించి మాట్లాడినట్లు తప్పుడుగా అర్థంచేసుకొని తనపై దాడికి వచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మరోవైపు సమావేశంలో పార్టీ నాయకులపై తీవ్ర వాఖ్యలు చేసిన పురమల్ల శ్రీనివాస్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం తెంలగాణ ఇన్‌చార్జి, టీపీసీసీ అధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు రాహుల్ తెలిపారు.

## నిజామాబాద్ గ్రామశివారులో రోడ్డు ప్రమాదం

● పలువురికి స్వల్పగాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్, మామిడిపల్లి గ్రామశివారులో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో స్వల్పగాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. ఈ రెండు గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న కారు, టాటాఏసీ ఢీకొన్నాయి. టాటా ఏసీలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో మంగళవారం రోడ్డుప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి నీరంకశంకర్ తీవ్రగాయాలపాలయ్యాడు. ఎల్లారెడ్డిపేట వైపు నుంచి సిరిసిల్లకు వెళుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ప్రమాదాన్ని చూసి ఆగారు. 108లో క్షతగాత్రుడిని సిరిసిల్లకు తరలించారు. నీరంక శంకర్ తన ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

## కొమిరలో ధాన్యం, పశుగ్రాసం దగ్ధం

ఓదెల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓదెల మండల కేంద్రంలో మంగళవారం బొంగోని రాజయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం, ధాన్యం విద్యుదాఘాతంతో నిప్పు అంటుకుని దగ్ధమైంది. ఇటీవల తన సీడ్ వరి పంటలోని మగ వరిని కోసి కుప్పగా వేసుకున్నారు. విద్యుత్ తీగలు ఒదులుగా ఉండడంతో గాలివీచిన సందర్భంలో వైర్లు ఒకదానికి మరొకటి తాకి నిప్పురవ్వలు ఎగిసిపడి అగ్ని ప్రమాదం సంభవించింది. పొలంలో కుప్ప పోసి ఉన్న ధాన్యం, మగవరి ధగ్ధం అయింది. ఎనభై వేల రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు రాజయ్య అవేదన వ్యక్తం చేశారు.

## అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య


రవీందర్‌రెడ్డి(ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తాటిపల్లికి చెందిన అట్ల రవీందర్‌రెడ్డి(42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రవీందర్‌రెడ్డి కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా నయం కాకపోవడంతో మంగళవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సైతెలిపారు.

## విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి


వికాస్‌రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇంజనీరింగ్ విద్యార్థిమృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా, పెగడపల్లి మండలం, ల్యాగలమర్రి గ్రామానికిచెందిన వికాస్ రెడ్డి(22)మండలకేంద్రంలోని ఓహాస్టల్‌లో ఉంటూ ఇంజనీరింగ్ బీటెక్(సీఎస్ఈ) 4వసంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం హాస్టల్ యజమాని సంతోష్‌రావు హాస్టల్‌పక్కనేఉన్న చెట్టుకొమ్మలు నరికేందుకు వికాస్‌రెడ్డితోపాటు మరోవిద్యార్థిని పురమాయించాడు. వికాస్ రెడ్డి చెట్టుఎక్కి కొమ్మలు నరుకుతుండగా చెట్టుకొమ్మ విరిగి కింద ఉన్న 11కేవీ విద్యుత్‌వైర్లపై పడింది చెట్టుకు విద్యుత్‌షాక్ రావడంతో చెట్టుపైఉన్న వికాస్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఎల్ఎండీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వికాస్‌రెడ్డిమృతిచెందిన విషయం తెలుసుకున్న ఇంజనీరింగ్ కళాశాలచైర్మన్ జువ్వాడిసాగర్‌రావుప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రాగి తీగ చోరీ

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుగుల, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లోని రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల నుంచి రాగితీగ చోరి అయినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన మొత్తం 12మోటార్ల నుంచి తీగ చోరీ అయిందన్నారు. ఒక్కో మోటార్‌లోని తీగ విలువ రూ.12నుంచి 20 వేల వరకు ఉంటుందని తెలిపారు.

# బస్సుల్లో చిల్లర సమస్యకు చెక్

● టిమ్, ఈటిమ్‌లు ప్రవేశపెడుతున్న ఆర్టీసీ ● ఆన్‌లైన్ పేమెంట్ల దిశగా అడుగులు



భగత్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్‌లైన్ పేమెంట్ల దిశగా అడుగులు వేస్తున్నది. టిమ్, ఈటిమ్‌లతో చిల్లర సమస్యతో పాటు, అన్ని సమస్యలను అధిగమించే దిశగా ముందుకు సాగుతున్నది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు ఉన్నాయి. అన్నిడిపోల్లో టిమ్‌లతో, పాటు కొత్తగా ఈటిమ్‌లను ప్రవేశ పెడుతున్నారు.

**● నగదు రహిత సేవలు**

ఆర్టీసీ నగదు రహిత సేవలను ప్రయాణికులకు అందించేందుకు నూతనంగా ఈటిమ్‌లను ప్రవేశపెడుతున్నది. ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యు మెషీన్లను (ఈ-టిమ్స్) ప్రస్తుతం ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్, స్లీపర్ బస్సులో ప్రవేశ పెట్టింది. వీటితో నగదు రహిత సేవలు అందించేందుకు వీలు ఉంది. ఈ టిమ్‌ల ద్వారా ప్రయాణికులు గూగుల్‌పే, ఫోన్‌పే, కార్డు స్వైపింగ్ తో డబ్బులు చెల్లించి టికెట్ పొందే అవకాశం ఉంటుంది. ఈ టిమ్ వ్యవస్థను దశలవారీగా ఇతర సర్వీసుల్లో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**● ప్రయాణికులకు తప్పనున్న ఇబ్బందులు**

ఈ టిమ్‌ల ద్వారా చిల్లర సమస్యకు చెక్ పడనున్నది.



కొత్తగా వచ్చిన ఈటిమ్, ప్రస్తుతం వాడుతున్న టిమ్

కండక్టర్ వద్ద చిల్లర లేని సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గమ్యస్థానంలో దిగేటప్పుడు ఇద్దరు ముగ్గురు ప్రయాణికులకు కలిపి డబ్బులు ఇస్తుండడంతో వారు ఇబ్బందులు పడేవారు.

**ప్రయోగాత్మకంగా అమలు**

**:బి రాజు, కరీంనగర్ ఆర్ఎం**



ఆర్టీసీ బస్సుల్లో ఈ టిమ్‌లను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాము. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల్లో టిమ్‌లు, ఈటిమ్‌ల ద్వారా సేవలు అందిస్తున్నాము. ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచైనా సర్వీస్ లోడ్ చేసే సదుపాయం ఉండడంతో ఇబ్బందులు తొలగి పోనున్నాయి. నగదు రహిత సేవలు ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఎన్నో ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

**11 డిపోలు.. 2,069 టిమ్‌లు**

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు ఉండగా అన్ని డిపోల్లో 2069 టిమ్‌లను అందుబాటులోకి ఆర్టీసీ రోడ్డు రవాణా సంస్థ తీసుకు వచ్చింది. రీజియన్‌లో డిపోల వారీగా టిమ్‌ల వివరాలు

| డిపో | టిమ్‌ల సంఖ్య |
|---|---|
| గోదావరిఖని | 294 |
| హుస్నాబాద్ | 90 |
| హుజూరాబాద్ | 149 |
| జగిత్యాల | 261 |
| కరీంనగర్-1 | 261 |
| కరీంనగర్-2 | 366 |
| కోరుట్ల | 125 |
| మంథని | 115 |
| మెట్‌పల్లి | 120 |
| సిరిసిల్ల | 112 |
| వేములవాడ | 176 |
| రీజియన్ | 2069 |

# పసిడి కాంతుల పర్వదినం

- నేడు అక్షయ తృతీయ
- రోహిణితో కూడిన బుధవారం కావడంతో విశిష్టత
- చుక్కలనంటుతున్న బంగారం ధర

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : అక్షయ తృతీయ రోజున ఏది కొన్నా అక్షయంగా మారి, పుణ్య ఫలాల్ని ఇస్తుందని, చిన్న దానమైనా దారిద్ర్యం దరి చేరకుండా చేస్తోందని శాస్త్రాలు చెబుతున్నాయి. పరబ్రహ్మ వైశాఖ శుద్ధ తృతీయ రోజునే సృష్టికి శ్రీకారం చుట్టాడంటారు. ఈ రోజు గంగను స్మరిస్తూ లక్ష్మీదేవిని పూజించాలని భవిష్య పురాణం చెబుతోంది. అందుకే బంగారాన్ని లక్ష్మీదేవిగా పూజిస్తారు. పుణ్య క్షేత్ర సందర్శన, పుణ్యతీర్థస్నానాలకు ఫలం రెట్టింపుగా ఉంటుంది. అక్షయ తృతీయ నాడు దేవతలు భూలోకంలో జనుల యోగ క్షేమాలు పరీక్షించేందుకు వస్తారని ప్రతీతి.



అందుకే మనసును, ఇంటిని సంతోషంగా, ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఈ రోజు పిసరంతైనా బంగారం కొని వాడుకున్నా, దానం చేసినా ఎంతో ఫలితం వస్తుంది. ఈ క్రమంలో బుధవారం అక్షయ తృతీయను జరుపుకోనున్నారు. ఈ ఏడు రోహిణీ నక్షత్రంతో కూడిన బుధవారం రావడంతో మరింత విశిష్టత సంతరించుకుంది. ధర్మసింధువులోనూ ఈ విషయం పేర్కొన్నారు.

### బంగారం, ఆభరణాల కొనుగోళ్ల సందడి

బంగారం, ఆభరణాల కొనుగోళ్ల సందడి సోమవారం నుంచే ప్రారంభమైంది. సెంటిమెంట్‌తో వినియోగదారులు బంగారం, వెండితో పాటు ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. ఆర్నమెంట్ వస్తువులకు గిరాకీ ఉన్నా బంగారం కొంటున్నారు. బహుమతుల కోసం రూ.1500 నుంచి ఆర్నమెంట్ వస్తువులు అందుబాటులో ఉండగా జువెల్లరి, స్వర్ణకారుల షాపులు సందడిగా మారాయి. పలు బంగారం షాపులు, స్టోర్లు ఆఫర్లు ప్రకటించాయి.



బంగారం కొనుగోలు చేస్తున్న మహిళలు

### జిల్లా వ్యాప్తంగా రూ.2 కోట్ల వ్యాపారం అంచనా

బంగారం ధరలు చుక్కలనంటుతుండడం, ఎండలు రారెత్తిస్తుండడంతో ఈ ఏడు జిల్లా వ్యాప్తంగా రూ.2 కోట్ల వరకు వ్యాపారం జరగనుననట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం బంగారం తులానికి(12 గ్రాములు) రూ.1,15,120, పది గ్రాములకు రూ.98,700 పలికింది. వెండి తులానికి (12 గ్రాములు)రూ.1,172, పది గ్రాములకు రూ.1,005 ధర పలికింది. బంగారు ఆర్నమెంట్ రూ.91,790 ధర పలికింది. గత సంవత్సరానికి ఈసారికి గోల్డ్ ధర భారీగా పెరగడంతో పాత బంగారు, వెండి ఆభరణాలకు తగినట్లుగా కొత్తగా వస్తువులు, బంగారం, వెండి కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. బంగారాన్ని షాపుల్లో సావరిన్ గోల్డ్ బాండ్స్ రూపంలో కొనడం మేలని నిపుణులు చెబుతున్నారు. బంగారం, షాపుల్లో విక్రయించే ఆభరణాలు, వస్తువుల కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 2 గ్రాముల నుంచి నాణాల రూపంలో బంగారం అందుబాటులో ఉండగా కొని బహుమానాలు ఇచ్చే ఆనవాయితీ కూడా ఉంది. ఈ అక్షయ తృతీయ అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ఆనందాన్ని ప్రసాదించాలని కోరుకుందాం.



## గుండారం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఎపిగ్రాఫికల్ సర్వే

### సీతమ్మలొద్దిలో శిలపై చెక్కి ఉన్న శాసనాల పరిశీలన

పెద్దపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ శాఖ సహకారంతో జిల్లాలోని గుండారం రిజర్వ్ ఫారెస్టు లోపల మంగళవారం భారత పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) ఎపిగ్రాఫికల్ సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా సీతమ్మలొద్దిలోని ఒక ప్రముఖ శిలపై చెక్కి ఉన్న శాసనాలను పరిశీలించారు. ఈ సర్వేను ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, భారత పురావస్తు సర్వే బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే బృందం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్రలో మొత్తం 11 పురాతన శాసనాలను ఎస్టాంపేజ్‌లో తీసుకున్నామన్నారు. క్రీస్తుపూర్వం 1వ శతాబ్దం నుంచి క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం వరకు ఉన్న ఈ శాసనాలు దక్కన్ ప్రాంతం యొక్క ప్రారంభ చరిత్ర, సాంస్కృతిక



గుండారం రిజర్వ్ ఫారెస్టులో ఎపిగ్రాఫికల్ సర్వే చేస్తున్న భారత పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా అధికారులు

పరిణామం గురించి చెబుతుందన్నారు. ఈ ప్రాంతాన్ని స్థానికంగా సీతమ్మలొద్ది అని పిలుస్తారని అన్నారు. ఇక్కడ ఒక ప్రముఖ శిలపై అన్ని శాసనాలు చెక్కబడి ఉన్నాయని, ఈ శాసనాలలో కొన్ని శాతవాహన కాలానికి చెందినవి ఉన్నాయన్నారు. ముఖ్యంగా శాతవాహన రాజవంశానికి చెందిన కుమార అకుసిరి యొక్క రెండు శాసనాలు ఈ ప్రదేశంలో మొదటిసారిగా గుర్తించబడ్డాయని పేర్కొన్నారు. ఇది భారతీయ శిలాశాసన రంగంలో అత్యంత ముఖ్యమైన ఆవిష్కరణను సూచిస్తుందన్నారు. అలాగే లిఖిత గ్రంథాలలో కొన్ని శాసనాలతో పాటు ఈ ప్రదేశం పాలియోలిథిక్ నుంచి చారిత్రక కాలాల వరకు ఈ ప్రాంతంలోని కొన్ని ముఖ్యమైన శిలాచిత్రాలకు నిలయంగా ఉందన్నారు. ఈ చిత్రాలు ఎరుపు, తెలుపు, పసుపు వర్ణద్రవ్యాలలో చిత్రీకరించబడ్డాయని, కాలక్రమేణా కళాత్మక వ్యక్తీకరణకు అమూల్యమైన ఆధారాలను అందిస్తాయన్నారు. గుండారం యొక్క సాంస్కృతిక, పురావస్తు ప్రొఫైల్‌ను సుసంపన్నం చేస్తాయన్నారు. ఈ ప్రాంతం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడంలో, ప్రోత్సహించడంలో నిరంతర మద్దతు ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ యాత్ర సర్వేలో భాగంగా ఫీల్డ్ వర్క్‌ను విస్తృతంగా డాక్యుమెంట్ చేసిన ప్రముఖ ఫొటో జర్నలిస్టు డి రవీందర్ రెడ్డి, రాక్ ఆర్ట్ పెయింటింగ్ స్పెషలిస్టు బీఎంరెడ్డి, అటవీ శాఖ రేంజర్ నాయక్ వారి వెంట ఉన్నారు.

## ఎస్‌యూ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (హానర్స్) కోర్సులో రెండో సెమిస్టరు, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను మంగళవారం విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టరు సురేష్ కుమార్ విడుదల చేశారు. వచ్చే నెల పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా 6-5-2025 వరకు, 300 రూపాయల అపరాధ రుసుముతో 9-5-2025 వరకు ఆయా కళాశాలల్లో ఆన్‌లైన్ పద్ధతిన చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో లేదా ఆయా కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

## హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్
# తప్పనిసరి

- సెప్టెంబరు 30 వరకు గడువు
- తరువాత తనిఖీల్లో పట్టుబడితే జరిమానా



తిమ్మాపూర్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను (హెచ్‌ఎస్‌ఆర్‌పి) తప్పనిసరిచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2019 ఏప్రిల్ 1 తరువాత తయారైన వాహనాలకు మాత్రమే ఈ నిబంధనలు అమలులో ఉన్నాయి. నూతన ఉత్తర్వుల ప్రకారం 2019 ఏప్రిల్ ముందు తయారైన వాహనాల తప్పని సరిచేస్తూ రాష్ట్ర రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను వాహనాలకు బిగించుకునేందుకు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకు గడువు ఇచ్చింది. నకిలీ నంబర్ ప్లేట్లను నిరోధించడం, వాహనాల దొంగతనాలను అరికట్టడం, రహదారి భద్రతను మెరుగు పరచడం వంటి లక్ష్యాలతో సుప్రీంకోర్టు ఆదేశాలతో రవాణాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, హోలో గ్రామ్ ఉంటుంది. వీటిని వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌తో అనుసం దనం చేస్తారు. ఈ నంబర్ ప్లేట్లను ట్యాంపర్ చేయడం, నకిలీవి సృష్టించడం సాధ్యం కాదు.

### బిగించుకోకపోతే ఇబ్బందులే..

పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత యజమానులదే. ఇకపై హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్‌ప్లేట్ లేని వాహనాలను అమ్మలన్నా, కొనాలన్నా సాధ్యం కాదు. వాహనాల రిజిస్ట్రేషన్ చేయరు. వాహనాలకు బీమా, పొల్యూషన్ సర్టిఫికేట్ కూడా జారీ చేయరు.

| వాహనం | చెల్లించాల్సిన ఫీజు రూపాయల్లో |
|---|---|
| ద్విచక్ర వాహనం | 320-380 |
| ద్విచక్ర వాహనం (ఇంపోర్టెట్) | 400-500 |
| కార్లు | 590-700 |
| కార్లు(ఇంపోర్టెడ్) | 700-860 |
| త్రీ వీలర్ | 350-450 |
| కమర్షియల్ వాహనాలు | 600-800 |

### ఎక్కడ బిగించుకోవాలి

వాహన తయారీ సంస్థల డీలర్ల వద్ద హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన ధరలను కూడా నిర్ణయించడం జరిగింది. వాటి ప్రకారం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి నంబర్ ప్లేట్‌ను బిగించుకోవాలి. వాహనదారుడు తమ ఇంటి వద్దనే నంబర్ ప్లేట్‌ను బిగించుకోవాలంటే అదనంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

### జిల్లా వ్యాప్తంగా వాహనాల వివరాలు

జిల్లా వ్యాప్తంగా 2019 మార్చి 31 నాటికి 5,44,824 వివిధ రకాల వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా ఏప్రిల్ 28-2025 నాటికి 6,55,223 వివిధ రకాల వాహనాలు రిజిస్ట్రేషన్ అయినాయి. వాహనదారులు వాహన రిజిస్ట్రేషన్ సమయంలో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం రుసుము చెల్లించినా చాలా మంది బిగించుకోలేదు. ప్రస్తుతం ఖచ్చితంగా బిగించుకోవాలి. లేకపోతే రవాణాశాఖ సేవాలు నిలిచి పోవాడమే కాకుండా సెప్టెంబరు 30 తరువాత వాహనాల తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానతో కేసులు నమోదు చేయనున్నట్లు రవాణాశాఖ అధికారులు అంటున్నారు.

### సెప్టెంబరు 30లోగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించుకోవాలి

**పురుషోత్తం, డీటీసీ**



సెప్టెంబరు 30లోగా ప్రతీ వాహనదారుడు తమ వాహనానికి హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ బిగించుకోవాలి. లేకపోతే రవాణా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ లేని వాహనాలకు భారీ జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తాం. వాహనాలను సీజ్ చేస్తాం. వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకపోతే రవాణా శాఖకు సంబంధించిన ఎటువంటి సేవలు వర్తించవు.

### ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం ఎలా

వాహనదారులు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ కోసం సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ www.sism.in, bookmyhsrp.com వెబ్‌సైట్లలో వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలి. నంబర్ ప్లేట్‌ను ఇన్‌స్టాల్ చేయాలనుకుంటున్న సమీప డీలర్‌ను ఎంచుకోవాలి. అనంతరం ఇన్‌స్టాలేషన్‌కు అపాయింట్‌మెంట్ బుక్ చేయడానికి ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించాలి. అపాయింట్‌మెంట్ తేదీన సంబంధిత డీలర్ వద్దకు వెళ్లి ఒరిజినల్ పత్రాలు, ఫీజ్ చెల్లించిన రసీదును చూపిస్తే వారు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగిస్తారు.



తిమ్మాపూర్‌లోని రవాణాశాఖ కార్యాలయం

## ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల మెరుపు సమ్మె

### సమస్యలు పరిష్కరించాలని డిమాండ్




ఆందోళన చేస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెరుపు సమ్మెకు దిగారు. ఫ్యాక్టరీ గేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ సంఘం యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేష్ మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీ ఎల్ యాజమాన్యం చర్చలకు రాకుండా కాలయాపన చేస్తుందని, రెండు నెలల కింద సమ్మె నోటీసు ఇచ్చినా స్పందించకుండా మొండి వైఖరి అవలంబిస్తుందన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు రూ.510కోట్ల లాభాలు వస్తే కార్మికులకు వాటా ఇవ్వకుండా తప్పించుకుంటుందని, కార్మికులకు కనీస పనికి కనీస వేతనం చెల్లించడం లేదని, ఇన్సెంటివ్‌లు, బోనస్‌లు ఇవ్వడం లేదని, పనిస్థలాల్లో కనీస వసతులు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీపీసీ ఎస్‌ఐ మానస సమ్మె విరమించాలని కార్మిక సంఘాల నాయకులను కోరగా తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఆందోళన చేస్తున్న కార్మికులతో అధికారులు మే 3న చర్చిస్తామని హామీ ఇవ్వడంలో కార్మికులు సమ్మెను విరమించారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, రాంకీ, అఫ్జల్, దేవయ్య, నయీం, నరేష్, రవి, శ్రీనివాస్, మహేందర్, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

## అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. దాదాపుగ ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్,అధికారులు పర్యవేక్షించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే**

## సైబర్ నేరాల ఛేదనకు శిక్షణా తరగతులు దోహదం..

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల ఛేదనకు శిక్షణా తరగతులు దోహదపడుతాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే అన్నారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల పరిశోధనలో అవసరమైన అంశాలపై కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట జిల్లాలకు చెందిన అధికారులకు, సిబ్బందికి రెండు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఇస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళిక రూపొందించవచ్చన్నారు. సైబర్ నిందితులకు శిక్ష పడటంలో డిజిటల్ సాక్ష్యాధారాల సేకరణ కీలకమన్నారు. సాంకేతికత ఆధారంగా అధికారులు, సిబ్బంది వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు.




మాట్లాడుతున్న రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బి.గీతే

పోలీసు అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు సమాజంలో జరిగే మోసాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సైబర్ మోసాలకు, సోషల్ మీడియాప్లాట్ ఫామ్‌ను దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడే నేరస్థులకు శిక్ష పడటంలో సాక్ష్యాధారాలు ప్రధాన పాత్రను పోషిస్తాయన్నారు. సైబర్ నేరం జరిగినపుడు ఫిర్యాదు నమోదు నుంచి డిజిటల్ ఆధారాల సేకరణ, విశ్లేషణ, తదితర అంశాలపై తెలుసుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేసే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయా పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.పిల్లల ఆన్‌లైన్ భద్రతపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, కోర్సు సమన్వయకర్త డీఎస్పీ రాజ్‌కుమార్, భీం కృష్ణనాయక్, సైబర్ ఎక్స్‌పర్ట్ అఖిలేష్‌రావు, పోలీసు అధికారులు, పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఎప్‌సెట్

తిమ్మాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అత్యంత కీలకమైన ఈఏపీసెట్ (ఎప్‌సెట్)-2025 పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 29,30 తేదీల్లో మంగళవారం, బుధవారం అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో పరీక్షలు జరగనుండగా, మే 2నుంచి 4వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరగనున్నాయి. దీనికిగాను కరీంనగర్ జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, సిద్దిపేటలో మొత్తం కలిపి 12 పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, శ్రీచైతన్య కాలేజీఆఫ్ టెక్నలజికల్ సైన్సెస్, కరీంనగర్‌లోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్‌సైన్స్, హుజూరాబాద్‌లోని కమల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, పెద్దపల్లి జిల్లాలోని ట్రినిటి, మథర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో, మంథనిలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జగిత్యాల జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సిద్దిపేట జిల్లాలో ఇందుర్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మరోపరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



తిమ్మాపూర్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో క్యూలో విద్యార్థులు

### రెండు సెషన్‌లలో పరీక్ష..

మంగళవారం జరిగిన ఈఏపీసెట్ (ఎప్‌సెట్)-2025 పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటిసెషన్‌లో 12 కేంద్రాల్లో కలిపి 2,860 మంది విద్యార్థులకుగాను 2,704మంది విద్యార్థులు పరీక్షకు (94.5%) హాజర య్యారు. 156మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 2,860మంది విద్యా ర్థులకుగాను 2,694మంది (94.2%) పరీక్షకు హాజరుకాగా 166మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. ఉద యం 7.30నుంచి, మధ్యాహ్నం 1.30నుంచి విద్యార్థు లను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. నిమిషం నిబంధన కారణంతో కొంతమంది విద్యార్థులు పరీక్ష సమయానికి రాకపోవడంతో రాయకుండనే వెనుతిరిగారు.



విద్యార్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

**ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని**

## పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ఎలిగేడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని బౌద్ధక్షేత్రం పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎరువుల సాగర్ డిమాండ్ చేశారు. మగళవారం మండలంలోని ధూళికట్ట గ్రామంలో ఉన్న అతి ప్రాచీన ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ధూళికట్ట బౌద్ధ క్షేతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్షానికి గురై కనీసం సరైన రోడ్డు సౌకర్యం, తాగునీటి వసతి, భద్రత లేకుండా పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. తెలంగాణలో అతి ప్రాచీనమైన చరిత్ర కలిగిన ధూళికట్ట బౌద క్షేతం నేడు అంధకారంలో మగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ధూళికట్ట బౌద్ధ క్షేతం పర్యాటక కేందంగ్రా అభివృద్ధి చేయాలన్నారు. మే 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా వేలాది మంది బుద్ధిస్ట్‌లు, పర్యాటకులు ధూళికట్ట బౌద్ధక్షేత్రాన్ని దర్శించుకుంటారని తక్షణమే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే చింత కుంట విజయరమణరావు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ధూళికట్ట బౌద్ధక్రేతం పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఇరుగురాల సాగర్, కలవల అనిల్, ఇరుగురాల శ్రీకాంత్, సుంకనపల్లి కార్తీక్, ఇరుగురాల వంశీ, గణేష్, సాయి పాల్గొన్నారు.



బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన పరిరక్షణ కమిటీ సభ్యులు

### దళారులను నమ్మి మోసపోవద్దు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్యాక్స్ కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం లోని ధర్మారం గ్రామంలో గల లలితా పరమేశ్వరి గుడి దగ్గర ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రాజేష్, సెంటర్ నిర్వాహకులు ధనేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

### ఏకరూప దుస్తుల తయారీ యూనిట్ పరిశీలన

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో ప్రభుత్వ విద్యార్థిని, విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ యూనిట్‌ను జగిత్యాల మండల ఐకేపీ ఏపీఎం తన సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళసంఘాల సభ్యులచే ఏకరూప దుస్తులను కుట్టిస్తున్నామన్నారు. నాణ్యతగా, వేగవంతంగా దుస్తుల తయారీ చేయాలని యూనిట్ నిర్వాహకులకు ఏపీఎం సూచించారు. రూరల్ మండలం లో 3567జతలు, అర్బన్ మండలంలో 553 జతలు కుట్టిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం లు ఓదెల గంగాధర్, సుభాష్‌చంద్రబోష్, సీసీ విద్యాసాగర్, మండల సమాఖ్య అధ్యక్షురాళ్లు గంగాభవాని, విఓఏ విజయ, సభ్యురాలు సంగీత త, తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 29 ( ఆంధ్రజ్యోతి) :జగిత్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన దశరథరెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దశరథరెడ్డి కాంగ్రెస్ హయాంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసి అందరి మన్ననలు పొందాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. దశరథరెడ్డి పార్థివదేహానికి ఎమ్మెల్యే, మాజీమంత్రి నివాళులు అర్పించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన మొగిలిపాలెం కనకయ్య అనే వృద్ధుడు ఇటీవల బైక్ ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మంగళవారం ప్రమాద బాధితుని ఇంటికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు వెంకటేష్‌గౌడ్, స్వామి, వెంకటి, రమేష్, శ్రీనివాస్, ప్రభుదాస్, చంద్రమొహన్, రాజేశం తదితరులు ఉన్నారు.

# తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

**●ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**



బోర్‌వెల్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని 5, 13 వ వార్డుల్లో అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విప్, ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో తాగు నీరు, డ్రైనేజీ, విద్యుత్ లాంటి సమస్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా తాగు నీటి సమస్య ఉంటే అక్కడ నూతనంగా బోర్‌వెల్స్ వేయిస్తామని తెలిపారు. చింతామణి చెరువు కట్టను హైదరాబాద్‌లో ఉన్న ట్యాంక్ బండ్ మాదిరిగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. గోదావరి నది నుండి చింతామణి చెరువులో నీటిని నింపడానికి ఉన్న పైపులైన్ మరమ్మతులు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వాకింగ్ చేసే వారు లైట్లు, ఓపెన్ జిమ్ వంటి వసతులు కల్పించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే విద్యుత్ లైట్లు, ఓపెన్ జిమ్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. గోదావరి నదిలో మురికి నీరు కలవకుండా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు కోసం రూ.17 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని ఇస్తామన్నారు. ధర్మపురి పట్టణానికి శాశ్వత మంచి నీటి పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ డీఈఈ వరుణ్, ఏఈఈ వినయ్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల యువజన కాంగ్రెస్ అప్పం తిరుపతి, అక్కపెల్లి రాజేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని బాలుర పాఠశాలలో చదివిన 2011-12 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళ వారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు పాదాభి వందనం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. విద్యార్థి దశలో చేసిన అల్లరిని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీహరి, నమ్మి రాజేందర్‌శర్మ, రమణరావు, వేంకటేశ్వరరావు, రామచంద్రరావు, విద్యార్థులు వంశీకృష్ణ, సురేందర్, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ధర్మపురి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ తల్లి స్వర్గం రాజవ్వకు హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో రూ.57 వేలు విరాళాలు సేకరించి బ్యాంక్‌లో జమ చేసి ఫిక్స్ డిపాజిట్ మంగళవారం అందించారు. మృతుడు శ్రీనివాస్ తల్లి ఆర్థిక పరిస్థితి బాగులేనందులకు హిందూ బంధువులు, దాతల సహకారంతో విరాళాలు సేకరించారు. అనంతరం ఆ డబ్బులు బ్యాంక్‌లో తల్లి పేరిట ఫిక్స్ చేశారు.

### లక్ష్యంతో ముందుకు సాగాలి

కోరుట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని అప్పుడే అనుకున్నది సాధించవచ్చని కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మూడవ సంవత్సరం విద్యార్థులకు విగమ 2025 వీడ్కోలు సమావేశంను నిర్వహించగా కోరుట్ల సీఐ సురేష్ బాబు పాల్గొన్నాడు. వీడ్కోల్ సమావేశంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కేరింతల మధ్య కళాశాల ఆవరణ పూర్తిగా సందడిగా మారింది. సీఐ సురేష్‌బాబు విద్యార్థులకు పలు సూచనలు అందించారు. విద్యార్థులు తమ తల్లి దండ్రులు, గురువుల యొక్క ఆశయాలను నేరవేర్చే విధంగా జీవితంలో ముందుకు సాగాలని అన్నారు. నిరంతర సాధనే విద్యార్థుల విజయానికి బాట అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గాడిపల్లి హరిప్రియ- ఆంజయ్య, ప్రిన్సిపల్ బెజ్జారపు ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## 'ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు'



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో హరీశ్

కథలాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం పంటల సాగుతో అధిక లాభాలు పొందడానికి అవకాశం ఉందని ఏఈవో మొండి హరీశ్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటలో మంగళవారం రైతులకు ఆయిల్ పాం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఎకరానికి 57 మొక్కలు నాటు కోవాలని 30 ఏళ్ల దాకా దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మొక్కకు రూ.20 చొప్పున డీహెచ్ఎస్‌వో పేరిట డీడీ తీయాల్సి ఉంటుందన్నారు. నాటే ముందు గుంతలో సూపర్ పాస్పేట్ లేదా 200 గ్రాముల డీఏపీ మరియు 50 గ్రాముల ఫోరేట్ గుళికలు మట్టిలో కలపాలని సూచించారు. అంతర పంటలుగా మొక్కజొన్న, నువ్వు, సోయా పంటలు పండించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఎకరానికి ఏటా రూ.4200ల చొప్పున మూడు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చులు అందిస్తుందని చెప్పారు. రైతులు ఆయిల్‌పాం పంటలను సాగు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజరెడ్డి, ఆయిల్‌పాం మండల ఎగ్జిక్యూటివ్ శ్రావణ్, రైతులు ఉన్నారు.

## సౌకర్యాలు ఉన్నా.. ఆదరణ కరువు

(5వ పేజీ తరువాయి)

మంది విద్యార్థులున్నారు. ఇందులో 25,604 మంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, 6,438 మంది ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, 25,729 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులున్నారు.

**● ముందస్తు బడిబాట..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. బడిబాట నిర్వహణపై ప్రభుత్వ ఆదేశాలు రానప్పటికీ పలు పాఠశాలల ఉపాధ్యాయులు ముందుగానే గ్రామాల బాట పట్టారు. ప్రైవేటు పాఠశాలల మాదిరిగా కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యార్థులు అందే సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను చేర్పించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉన్న వసతులు, నమోదైన ఫలితాలు ఉదాహరణలతో సహా వివరిస్తున్నారు. మా బడి ఎలా ఉందంటే అంటూ..ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే బోధన, సౌకర్యాలు, ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, రాగిజావ, స్కాలర్ షిప్‌లు అందుతుండడం తదితర వాటిని కరపత్రాల్లో వివరిస్తున్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల కరపత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### సమన్వయంతో కృషి చేస్తున్నాం

**-రాము, జిల్లా విద్యాశాఖాధికారి**



ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం. ప్రస్తుత వేసవి సెలవుల్లో సైతం పలు పాఠశాలల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బడుల్లో చేరే పిల్లల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పించే బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిస్తే నాణ్యమైన విద్యను పొందవచ్చు.

### 'అర్బన్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హౌసింగ్ కాలనీలో మౌలిక సౌకర్యాల కల్పన పూర్తి అయినందున లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇళ్లలో ఉండేలా చొరవ తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మున్సిపల్ అధికారులకు సూచించారు. మంగళవారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో పట్టణ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో పారిశుధ్యం, తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నివారణపై ఆర్పీలు, వార్డు ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో మొక్కల సంరక్షణ చేపట్టి వాటికి నీరు అందించాని అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల విషయంలో ఆలస్యానికి గల కారణాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, డీఈ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు వేయించాలి

కథలాపూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు అన్నారు. మండలంలోని తక్కళ్ళపల్లిలో మంగళవారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అధిక పాల దిగుబడులు ఇచ్చే గడ్డిని రైతాంగం సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు అంకం శ్రీనివాస్, దివ్యశ్రీ, సిబ్బంది ఉన్నారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లోని వంజరిపల్లి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్, లైవ్ అసిస్టెంట్లు గంగాధర్, విశాల్, నరేష్ పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా విశ్వనాథరాజు



కొడిమ్యాల, ఏప్రిల్29: కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ విశ్వనాథరాజు నాచుపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన సురేష్‌కుమార్ హైదరాబాద్ జేఎన్‌టీయూకు వెల్లారు. ట్రిపుల్‌ఈ హెచ్‌వోడీ డాక్టర్ కె.శ్రీనివాస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరిచారు.

### నిబంధనలు పాటించని పలు ప్రైవేట్ పాఠశాలలు

**-ఎండలో ఉపాధ్యాయులతో ప్రచారం**

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఎండలో ఉపాధ్యాయులతో అడ్మిషన్ల కోసం ప్రచారం చేయిస్తున్నాయి. దీంతో పలువురు ప్రైవేట్ ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ క్యాంపెనింగ్ పేరుతో ఉపాధ్యాయులను అడ్మిషన్ల కోసం ప్రచారం చేయించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షించి ప్రైవేట్ ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

### అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రి సీజ్

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ సీజ్ చేశారు. మంగళవారం పట్టణంలో జ్యోతి క్లినిక్ పేరుతో నిర్వహిస్తున్న ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్లినిక్ లో పలు రికార్డులను పరిశీలించారు. అర్హత లేకుండా చికిత్స చేయడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ తనిఖీలలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.ఆకుల శ్రీనివాస్, మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

### మెమొరీ చాంప్ అవార్డు అందుకున్న చెప్యాల కుర్రాడు

కొడిమ్యాల, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన మండల వేదాన్షిత్‌రెడ్డి అనే మూడో తరగతి విద్యార్థి నేషనల్ సూపర్ మెమొరీ చాంప్ అవార్డును మంగళవారం కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవిద్య చేతుల మీదుగా అందుకున్నాడు. చెప్యాల గ్రామానికి చెందిన మండల కార్తీక్‌రెడ్డి కుమారుడు వేదాన్షిత్‌రెడ్డి కరీంనగర్ పట్టణంలోని ఓ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. గత నెలలో కంప్యూటర్ కోడింగ్ అయిన బైనరీ డిజిట్స్ 10011..సీరీస్‌ను 100 సంఖ్యల గల నెంబర్లను ఒకసారి చూసి పూర్తిగా జ్ఞాపకం ఉంచుకొని ప్రదర్శించాడు. మల్టీ టాలెంటెడ్ చైల్డ్ ప్రాడ్జీగా గుర్తింపు పొంది రికార్డు సాధించాడు.

### 'బీఆర్ఎస్ సభ విజయవంతాన్ని జీర్ణించుకోని కాంగ్రెస్'

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవానికి తరలి వచ్చిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిపై విసిగి వేసారిన జనం కేసీఆర్‌పై అభిమానంతో లక్షలాదిగా తరలి వచ్చారన్నారు. ధర్మపురికి మంజూరు అయిన అగ్రికల్చర్ కళాశాలను తరలిపోకుండా కాపాడాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సూచించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దావ వసంత పాల్గొన్నారు.

### 'రాజకీయ కుట్రతోనే దాడి'

కోరుట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కుట్రతో తనపై ఈ నెల 16వ తేదీన దాడి జరిగిందని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇందూరి సత్యం ఆరోపించారు. మంగళవారం స్థానిక విలెకర్లకు పంపిని పత్రిక ప్రకటనలో ఇందూరి సత్యం పేర్కొన్నాడు. మున్సిపల్ కార్యాలయంలో తనను చంపడానికి పెద్ద కుట్ర జరిగిదని ఈ కుట్రలో వెనుక రాజకీయంగా దెబ్బతీయాడనికి పెద్ద కుట్ర జరిగిందన్నారు. దీనిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయ్యగా ఎఫ్ఆర్ఐ నంబర్ 149/2025 క్రింద కేసు నమోదు చేసి కుట్ర పన్ని వారిని పోలీసులు తహసిల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసారని తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో సర్వేను మండల స్థాయి అధికారులు నిర్వహించారు. ఇండ్ల కొసం దరఖాస్తు చేసకోన్ని వారి గుర్తించిన జాబితాను జిల్లా కలెక్టర్ కార్యలయంలో సమర్పించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడ్, సంగని శంకర్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

### జనసమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి పార్టీ 7వ ఆవిర్భావ దినోత్సవం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి కంతి మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు ఏశాల గంగారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పై పోరాటంలో తెలంగాణ జన సమితి పార్టీ ముందు ఉంటుందాని, నిరంతరం ప్రజా సమస్యలపై, విద్యార్థిని, నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ జన సమితి పార్టీ అన్నారు.

రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పార్టీ తెలంగాణ జన సమితి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిజెఎస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్,మండలం అధ్యక్షులు కంతి రమేష్, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, నాయకులు కాట దశరథ్‌రెడ్డి, కంతి లింగారెడ్డి, కంతి ప్రశాంత్, గోవర్ధన్, ఒడ్డె మోహన్, బద్దీ రాములు, జిల్లా రాజేందర్, తెలంగాణ జన సమితి యువ నాయకులు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేసవి సెలవులు కావడంతో మంగళవారం ఎల్లమ్మ అమ్మ వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మ వారి దర్శణానికి నిర్మల్, నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలతో పాటు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తి శ్రద్ధలతో భక్తులు నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. కోడి, మేకలను అమ్మవారికి బలి ఇవ్వడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి ఒక్క రోజు సేవ టికెట్స్ ద్వారా రూ.40,070, హుండీ ద్వారా రూ.10,153, ఐదు గ్రాముల వెండి కానుకలు వచ్చినట్లు దేవాదాయ శాఖ డిప్యూ టేషన్ అధికారి కల్వకుంట్ల అనిల్‌రావు తెలిపారు.

దేవాదాయ శాఖ పరిశీలకులు సరేందర్ కార్యనిర్వహణ అధికారి కాంతరెడ్డి సూచనలతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదయ శాఖ సిబ్బంది కూకట్ల రాజేందర్, పైడివెల్లి నర్సయ్య, మాత గంగమ్మ, పలువురు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## 3 నుంచి లక్ష్మీ నరసింహస్వామి నవరాత్రోత్సవాలు

ధర్మపురి, ఏప్రిల్ 29 ( ఆంధ్రజ్యోతి ): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నవరాత్రోత్సవాలు మే 3 నుండి 11 వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3 న శనివారం ఉదయం 6 గంటలకు మంగళ వాయిద్యాలతో గోదావరి నదికి వెళ్లి అర్చకులు బిందె తీర్థం తీసుక వస్తారని వారు పేర్కొన్నారు. అనంతరం పుణ్యాహవచనం, రుత్విక్వరణం, కలశస్థాపన, అభిషేకం, సాయంత్రం వేదోక్తంగా సహస్ర కలశస్థాపన, వనగ్రహ యోగిని, వాస్తు, క్షేత్రపాలక స్థాపనలు, అర్చనాది ఆరాధనా కార్యక్రమాలు, నిత్య హోమాలు జరుగుతాయని తెలిపారు. మే 7 న సహస్ర కలశాభిషేకం, 8 న చందనోత్సవం, 9 న అన్నకూటోత్సవం, పల్లవోత్సవం, వసంతోత్సవం, 10 న లక్ష తులసీ అర్చన, 11 నృసింహ జయంతి విశేష కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. నృసింహ జయంతి సందర్భంగా స్తంభోద్భవ కాలంలో విశేష పూజలు, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):మెట్‌పల్లి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళ వారం మున్సిపల్ కమిషనర్ టి. మోహన్‌కు లేబర్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 2వ తేదిన కార్మికుల జీతాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఆదేశాల మేరకు 2వ తేదిన జీతాలు, సమస్యలు పరిష్కరించాని యెడల కార్మికులు సమ్మె చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల ఉల్లాసంగా, ఉత్సా హంగా జోష్-2కే25 పేరుతో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తమ కళాశాలకు అటానమస్ హోదా దక్కడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నామని, మంచి ప్రణాళిక, నిరంతర శ్రమ, కృషి, అంకితభావంతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. త్వరలో జరగబోయే సెమిస్టర్ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినులచే ప్రదర్శించబడిన పలు నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

### విద్యార్థినికి అభినందన

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాందారికారి ఉమా సురేష్ దంపతుల కుమార్తె లహరి ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గానూ, 468 మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వారి ఇంటికి వెళ్లిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విద్యార్థినిని అభినందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వసంత మాట్లాడుతూ విద్య ఒక్కటే జీవితాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్తుందని అన్నారు. భవిష్యత్తులో లహరి మంచి ఉన్నత స్థితిలో ఉండాలని ఆకాంక్షించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు గట్టు సతీష్, శీలం ప్రవీణ్, వెంకటేశ్వర్‌రావు, రాగుల రాజు, గోడిసెల శ్రీనివాస్ తదితరులున్నారు.

### కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె

కొడిమ్యాల, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె మంగళవారం నాటికి పదకొండో రోజుకు చేరుకుంది. మూడు రోజుల్లో రెగ్యులరైజేషన్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు నస్రీన్‌సుల్తానా, గౌతమి, స్వాతి, లత, సుజాత తదితరులు పాల్గొన్నారు.